క్లుప్తంగా

చేతుల శుభ్రతపై అవగాహన



చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: చేతుల శుభ్రతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాష్‌డేను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. రోగాల బారిన పడకుండా ఉండటానికి బయట నుంచి ఇంటికి వెళ్లిన వెంటనే చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలన్నారు. భోజనం చేసే ముందు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి బ్రహ్మానందం, పి.నిర్మల, జి.జ్యోతి, పీడీ సుధారాణి పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఏడీఈఎన్ బి.శివప్రసాద్ ఎంతో కృషి చేశారని రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అన్నారు. ఏడీఎన్ బదిలీ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏఈడీఎన్ శివప్రసాద్ భీమవరం బదిలీ కాగా అతని స్థానంలో కర్నూల్ జిల్లా గుత్తి నుంచి పి.ప్రభాకరరావు ఏడీఎన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కొత్త ఏడీఈఎన్‌కు రైల్వే అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ



చిన్నారితో వ్యాయామం చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు

కోటనందూరు: స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఫిజియోథెరపీ సేవలు అందించారు. ఫిజియోథెపిస్టు టీఎస్ఎస్ సోమేశ్వరరావు చిన్నారులతో వారి అవసరాలకు అనుగుణంగా వ్యాయామాలు చేయించారు. చిన్నారుల ఆరోగ్యం, వారి ఆరోగ్య మెరుగుదలకు అందించాల్సిన పౌష్టికాహారం పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ రామశేఖర్ ఐఈఆర్‌ప్లు పాల్గొన్నారు.

ఈ పంట నమోదు పొడిగింపు

గండేపల్లి: ఈ పంట నమోదుకు ఈనెల 25వ తేదీ ముందుగానే నమోదు చెయ్యాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. గండేపల్లి వ్యవసాయ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ల్యాండ్ పార్సిల్‌ను ఈ పంట నమోదులోకి తీసుకురావాలని, ప్రధాన పంటలైన వరి, పామాయిల్ పంటలు నమోదు అయినప్పటికి మిగిలిన పంటలను నమోదుచేయాలన్నారు. గ్రామ కంఠం, వ్యవసాయేతర భూములను ఈ పంటలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ జి శ్రీనివాస్, ఏఓ జే లక్ష్మి, ఏఈఓ పి చంద్రమౌళి, వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

యూరియా కోసం అవస్థలు



గండేపల్లి సొసైటీలో వివరాలు నమోదు చేయించుకుంటున్న రైతులు

గండేపల్లి: యూరియా కోసం మండల పరిధిలోని రైతులకు అవస్థలు తప్పడం లేదు. గండేపల్లి సొసైటీ వద్ద రెండు గత రోజుల నుంచి రైతులు పడిగాపులు కాస్తున్నారు. శుక్రవారం వచ్చిన స్టాక్‌ను సోమవారం రైతులకు పంపిణీ చేసినప్పటికి పూర్తిస్థాయిలో అందకపోవడంతో కొంత మంది అసహనంతో వెనుతిరిగారు. మంగళవారం సొసైటీకి 225 బస్తాలు (10 టన్నులు) రావడంతో బుధవారం సొసైటీకి చేరుకున్న రైతులకు ఆధార్, పాస్‌బుక్ ప్రక్రియ ద్వారా సొసైటీ సిబ్బంది రైతులకు యూరియా అందజేశారు. మొత్తంగా 153 మంది రైతులకు యూరియా అందగా మరి కొంతమంది రైతులకు యూరియా కావాల్సిఉండగా నిరుత్సాహంతో వెనుతిరిగారు.

కార్తిక మాసంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కార్తికమాసం సందర్భంగా పంచారామాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26, నవంబర్ 2, 9, 16 తేదీల్లో ఏలేశ్వరం, కాకినాడ, తుని డిపోలు నుంచి ఆదివారం రాత్రి బస్సులు బయలుదేరి సోమవారం రాత్రికి తిరిగి చేరుకొంటాయన్నారు. ప్రత్యేక బస్సుల్లో ప్రయాణానికి అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు సిద్ధం చేసినట్లు చెప్పారు. కార్తీక మాసంలో కాకినాడ నుంచి శ్రీశైలం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. శబరిమల యాత్ర చేసే అయ్యప్ప స్వాములకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామన్నారు. కావాల్సిన వారు ఆయా డిపోల్లో సంప్రదించాలన్నారు.

లీకులతో తరచూ బ్రేకులు

- అందుబాటులో గోదావరి జలాలు
- పెద్దాపురం ప్రజలకు అందని తాగునీరు
- 70 శాతం మంది ప్రజలకు బోరు నీరే గతి
- పాండవుల మెట్టపై ట్యాంకుల నిర్మాణంతో సమస్యకు పరిష్కారం



పెద్దాపురానికి తాగునీరు సరఫరా చేసే సాంబమూర్తి రిజర్వాయర్



సాంబమూర్తి రిజర్వాయర్ ఫిల్టరు చెరువు



ఫిల్టరు చెరువులో నీటిని శుద్ధి చేసే ప్లాంటు



పెద్దాపురం వాటర్ బూస్టర్ ట్యాంకు

సామర్లకోట: గోదావరి జాలాలు అందుబాటులో ఉన్నా పెద్దాపురం పట్టణ ప్రజలకు ఆ నీరు అందని పరిస్థితి ఏర్పడింది. గోదావరి జలాలను శుద్ధి చేసి ప్రజలకు అందజేయడానికి సామర్లకోట- కాకినాడ రోడ్డులో సుమారు 40 ఏళ్ల క్రితం సాంబమూర్తి రిజర్వాయర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ రిజర్వాయర్ నుంచి తాగునీరు కాకినాడ, పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీకి ఇవ్వాలని అప్పట్లో నిర్ణయించారు. అయితే అప్పటి మున్సిపల్ పాలకులు సామర్లకోటలో సమృద్ధిగా తాగునీటి వనరులు ఉన్నాయని చెప్పడంతో ఆ రిజర్వాయర్‌ను తనకు అప్పగించాలని అప్పటి పెద్దాపురం మున్సిపల్ చైర్మన్ ముప్పన రామారావు పట్టు పట్టడంతో ఆ మున్సిపాలికి అప్పగించి, కాకినాడ కూడా తాగునీరు సరఫరా చేస్తున్నారు. రిజర్వాయర్ ద్వారా ప్రజలకు తాగునీరు అందజేయడానికి సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో చెరువులను తవ్వకం చేశారు. చెరువు అడుగు భాగం ఇసుకతో నింపడం వలన గోదావరి జలాలు ఈ చెరువులోనికి వచ్చిన తరువాత కొంత మేరకు శుద్ధి అవుతున్నాయి. దాంతో ఈ ఫిల్టరు ప్లాంట్‌లోని తాగునీరు రుచిగా ఉండడంతో అప్పటిలో కొంతమంది రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు సామర్లకోట మున్సిపాలిటీలో 12 పబ్లిక్ కుళాయిలను ఏర్పాటు చేశారు. 2005లో తోట గోపాలకృష్ణ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఫిల్టర్ బెడ్ ప్లాంట్‌ను ఆధునీకరించారు.

పైపులైన్ ద్వారా ట్యాంకుకు నీటి సరఫరా

సాంబమూర్తి రిజర్వాయర్ నుంచి రైల్వే ట్రాక్ దిగువ భాగం నుంచి బ్రౌన్‌పేట, ఇండస్ట్రీయల్ ఏరియా, ప్రసన్నాంయనేయస్వామి ఆలయం మీదుగా వాటర్ వర్క్స్ వద్ద ఉన్న బూస్టర్ ట్యాంకుకు చేరుతుంది. వాటర్ వర్క్స్‌లోని సంపులోకి వచ్చిన నీరు మోటార్ల ద్వారా ట్యాంకులో నింపి పట్టణ ప్రజలకు సరఫరా చేసేవారు. దీనిలో బూస్టర్ ట్యాంకు నుంచి గౌరీ కోనేరు, పాండవుల మెట్ట వద్ద ఉన్న ట్యాంకుల్లో నింపి ప్రజలకు తాగునీరు సరఫరా చేసేవారు. అయితే గత కొన్నేళ్ల నుంచి బూస్టర్ ట్యాంకు నుంచి ప్రధాన పట్టణంలోని వారికే తాగునీరు సరఫరా అవుతోంది. దీంతో మిగిలిన ప్రాంతాలలో 70 శాతం ప్రజలకు బోరు నీరే గతి అయ్యింది. దీనిపై అనేక పర్యాయాలు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాల్లో అధికారులను ప్రశ్నించినా స్పందన లేదని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట నుంచి పెద్దాపురానికి సుమారు ఆరు కిలోమీటర్ల పొడవున ఏర్పాటు చేసిన ప్రధాన పైపులైన్ నిర్వహణ లోపం కారణంగా పైపులైన్ పొడవునా లీకులు ఏర్పడుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. బ్రౌన్‌పేట నుంచి సుధా ఫ్యాక్టరీ వరకూ తరచూ పైపులైన్లు లీకులు పడుతున్నాయని కౌన్సిలర్లు తెలియజేస్తున్నారు.

పైపులైన్ మార్పు చేయాలి



పట్టణ ప్రజలందరికీ గోదావరి జలాలు అందజేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారుల పై ఉంది. కొంత మందికి మాత్రమే గోదావరి జలాలను పరిమితం చేయడం సరికాదు. అందరి నుంచి తాగునీటి పన్ను వసూలు చేస్తున్నారు. కౌన్సిల్ సమావేశాల్లో ప్రశ్నిస్తే పైపులైన్ లీకులు కారణంగా తాగునీటి సమస్య ఏర్పడుతుందనే సమాధానం ఇస్తున్నారు. బోరు నీటి వల్ల రోగాల బారిన పడాల్సి వస్తోంది. సామర్లకోట నుంచి ప్రధాన పైపులైన్ మార్పు చేసి, పాండవుల మెట్టపై రెండు పెద్ద ట్యాంకులు నిర్మిస్తే ప్రజలందరికీ గోదావరి జలాలు అందుతాయి.

– ఎస్‌కే రఫీ, కోఆప్షన్ సభ్యుడు , పెద్దాపురం

లీకులతోనే తాగునీటి సమస్య



సామర్లకోట నుంచి పెద్దాపురం పంపు హౌస్ వద్ద వస్తున్న పైపులైన్ లీకులు కారణంగా గోదావరి జలాలను సమృద్ధిగా అందజేయలేకపోతున్నాం. పెద్దాపురం-సామర్లకోట రోడ్డు విస్తరణకు ముందు ప్రధాన పైపులైన్ రోడ్డు మార్జిన్‌లో ఉండేది. రోడ్డు విస్తరణతో పైపులైన్ రోడ్డు మధ్యలోనికి వచ్చింది. భారీ వాహనాల రాకపోకలతో పైపులైన్ తరచూ పగిలిపోతోంది. వాటిని మార్పు చేయడానికి ఆ పైపులు ప్రస్తుతం లభించడంలేదు. అదే విధంగా బూస్టర్ ట్యాంకు నుంచి గౌరీ కోనేరు, పాండవుల మెట్ట వద్ద వెళ్లే పైపులైన్ పాడైపోవడంతో ఆయా ప్రాంతాలకు బోరు నీరు సరఫరా చేస్తున్నాం. జలధార నిధులు రూ.38 కోట్లతో పైపులైన్లు మార్పు చేయడానికి ప్రతిపాదనలు తయారు చేశాం. దాంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అయితే జలజీవన్ మిషన్ పథకంలో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి అవకాశం లేదు.

– కె.శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు

కొత్తపల్లి: దీపావళి బాణసంచా దుకాణాలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని తహసీల్దారు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో దుకాణాలు ఏర్పాటుపై బుధవారం ఆయాన మాట్లాడుతూ దుకాణాలను ఏర్పాటు చేసుకునే వారు అగ్నిమాపక, పోలీసులు శాఖలకు సంబంధించిన అనుమలుతు తప్పనిసరిగా పొందాలన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా షాపులను ఏర్పాటు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. మందుగుండు సామగ్రిని అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు. ఏ ప్రమాదం సంభవించినా దానికి పూర్తి బాధ్యత నిర్వహకులే వహించాలన్నారు. ఇప్పటి వరకూ 8 దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతుల కోసం దరఖాస్తులు అందాయని వీటిని గ్రామ రెవెన్యూ అధికారి పోలీసులతో దుకాణాల ఏర్పాటు పరిశీలన చేసిన తరువాత మాత్రమే నివేదికను ఉన్నతాధికారులకు అనుమతుల ప్రకారం మంజూరు చేస్తామన్నారు.

మూలపేట-3, వాకతిప్ప-2, కొండెవరం-1, కొత్తపలిల-2 దరఖాస్తు అందిందన్నారు. అనుమతులు పొందిన వారు నిబంధనలు పాటించాలన్నారు.

కౌన్సిలర్ రాజీనామా ఉపసంహరణ

వైస్ చైర్మన్ సాయిప్రసాద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు

పెద్దాపురం (సామర్లకోట): మున్సిపల్ కౌన్సిలర్ పార్టీ సీనియర్ నాయకుడు ఆరెళ్ల వీరరాఘవులు రాజీనామాను ఉపసంహరణ చేసుకున్నారని పెద్దాపురం మున్సిపల్ వైస్‌చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ తెలిపారు. పట్టణానికి చెందిన ఒక విలేకరి వీరరాఘవులను ఇబ్బందులకు గురి చేయడంతో వైఎస్సార్ సీపీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారని, అయితే ఆ విలేకరిపై పత్రికా యాజమాన్యం చర్యలు తీసుకోవడంతో రాజీనామా ఉపసంహరించుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా వీరరాఘవులు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నానని మున్సిపల్ వైస్‌చైర్మన్ సూచన మేరకు రాజీనామాను ఉపసంహరించుకొని పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ విజయానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ విలేకర్ల సమావేశంలో కౌన్సిలర్లు తల్సిక సత్యభాస్కరరావు, కోటి పవన్, గుర్రాల యాకోబ్, కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే రఫీ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు రూ.10.71 కోట్లు

డ్వామా పీడీ వెంకటలక్ష్మి



సామాజిక తనిఖీల బృందాల నుంచి వివరాలు తెలుసుకుంటున్న పీడీ తదితరులు

సామర్లకోట: మండల పరిధిలో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31వతేదీ వరకు జరిగిన 944 ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ.10,71,42,448 ఖర్చు చేసినట్టు జరిగిందని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మెటీరియల్ రూపంలో రూ.3,83,61,588, వేతన రూపంలో రూ.6,87,80,860 ఖర్చుచేయగా సామాజిక తనిఖీల బృందం రూ.1,72,224 రికవరీ చేసినట్టు తెలిపారు. మండల స్థాయిలో ఈనెల ఒకటి నుంచి 13 వరకు ఆయా గ్రామాలలో సామాజిక బృందాలు ఉపాధి హామీ పనులను తనిఖీ చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీడీ పి.వసంతమాధవి, డీవీఓ పి.విజయభాస్కర్, డిప్యూటీ డైరెక్టరులు ఏపీసాట్, బి.రామారావు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరీ ఎస్ఆర్‌పీ సీహెచ్ సత్యనారాయణ, డీఆర్పీలు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అబ్దుల్ కలామ్

- విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు
- విజేతలకు బహుమతులు అందజేసిన తహసీల్దార్, ఎస్ఎం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న చంద్రశేఖరరెడ్డి, రమేష్, సాయిరామకృష్ణ



విద్యార్థులకు సేవలందిస్తున్న ప్రకాష్‌కు అవార్డు అందజేసి సత్కరించిన తహసీల్దార్

సామర్లకోట: నేటి బాలబాలికలతోపాటు యువత అబ్దుల్ కలామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, రైల్వే స్టేషన్ మేనేజరు ఎం.రమేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ అన్నారు. మదర్‌థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ జయంతిని పురస్కరించుకొని స్థానిక టీటీడీసీలో ఏర్పాటు చేసిన వ్యాస రచన, వక్తృత్వ పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఒక గోల్‌ను ఏర్పర్చుకోవాలని, విజయం వైపు దూసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా పాల్గొన్న డాక్టర్లు గిరిరాజు, సింధూర, జేఎన్‌టీయూ ప్రొఫెసర్ సూర్యనారాయణలు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పాల్గొన్న విద్యార్థులు అద్భుతంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలో ప్రదర్శన ఇచ్చారని తెలిపారు. వీటిలో సుమారు 900 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతి ఒక్కరూ విజేతలేనన్నారు. వలంటీరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ సేవలందిస్తున్న జీవీఎస్ఎస్ ప్రకాష్‌కు అబ్దుల్ కలామ్ అవార్డును అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ప్రకాష్‌కు అవార్డును అందజేసిన తహసీల్దార్, రైల్వే స్టేషన్ మేనేజరు, సాయిరామకృష్ణలు సత్కరించారు. ఈమేరకు విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ముఖ్య అతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలామ్ జయంతి

పెద్దాపురం(సామర్లకోట): దివంగత రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ 94వ జయంతిని పెద్దాపురం శ్రీప్రకాష్‌లో బుధవారం ఘనంగా జరిపారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ప్రొఫెసర్ ఆర్.సంతానం పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకడమిక్ కోఆర్డినేటర్, కల్చరల్ కోఆర్డినేటర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల హక్కులను కాపాడుకోవాలి

జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ దుర్గారాణి

పిఠాపురం: బాలికల హక్కులను కాపాడుకోవాలని వారిపై ఉన్న లింగ అసమానతలను తొలగించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి సూచించారు. మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సీహెచ్ లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో గొల్లప్రోలు బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పిఠాపురం, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, బాల్యవివాహాలు వల్ల జరిగే అనర్థాలను నివారించి, వారి హక్కులను తెలియ జేసేందుకు ఐక్యరాజ్య సమితి బాలికల దినోత్సవాన్ని ప్రకటించిందన్నారు. ఈ సంవత్సరం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ వేడుకలు అక్టోబర్ 11 నుంచి 18 వరకు జరగనున్నాయని ఈ సమావేశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు, ఆటల పోటీలు కూడా నిర్వహించి వారికి అధికారులతో బహుమతులు అందజేయనున్నారని ఆమె తెలిపారు. మండలంలో పలు పాఠశాలలలో బాలికలకు వ్యాసరచన పోటీలు ఆటపాటల పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ సూర్యప్రకాశరెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థినులు పాల్గొన్నారు.

బాణసంచా షాపుల ఏర్పాటుకు స్థలం పరిశీలన



బాణసంచా తాత్కాలిక షాపుల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, షాపుల నిర్వాహకులు

సామర్లకోట: దీపావళి సందర్భంగా స్థానిక బడేలమ్మ చెరువు వద్ద తాత్కాలిక బాణసంచా విక్రయ షాపులు ఏర్పాటుకు త్రిసభ్య కమిటీ ఆమోదం తెలిపింది. గత 13 ఏళ్లుగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బాణసంచా తాత్కలిక షాపులు ఏర్పాటు చేసుకొని విక్రయాలు సాగించేవారు. అయితే కళాశాల ఆవరణలో షాపుల ఏర్పాటుకు అనుమతి లేదని ప్రిన్సిపాల్ సీహెచ్ లీలాశ్రీదేవి తెలిపారు. దాంతో ప్రత్యామ్యాయంగా టీటీడీసీ సమీపంలోని రోడ్డుకు ఇరువైపులా 14 షాపులు ఏర్పాటుకు అనువైన స్థలంగా గుర్తించారు. ఈ స్థలాన్ని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో సీఐ ఎ.కృష్ణభగవాన్, జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి శ్రీహరిజగన్నాథ్, షాపుల నిర్వాహకులు పరిశీలించారు. బాణసంచా విక్రయం జరిగే రెండు రోజుల పాటు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి పిఠాపురం వెళ్లు రోడ్డులో ట్రాఫిక్ మళ్లింపు చేయడానికి పోలీసులు నిర్ణయం తీసుకున్నారు. దాంతో ఆ ప్రదేశంలో షాపుల ఏర్పాటుకు అమ్మకందారులు అంగీకరించారు.

ప్రతి మూడు నెలలకు ఓటర్ల జాబితా అప్‌డేట్

రాజకీయ పార్టీల సమావేశంలో అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి కుమారి



రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ల నమోదు తదితర అంశాల తెలియజేస్తున్న ఏఈఆర్వో కుమారి

కాకినాడ రూరల్: ఓటర్ల నమోదును నిరంతరం కొనసాగిస్తూనే ప్రతి మూడు నెలలకు ఒకసారి అప్‌డేట్ చేయనున్నట్లు మార్పులు, చేర్పులు, తప్పులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులను కాకినాడ రూరల్ తహసీల్దార్, అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్ఎల్ఎస్ కుమారి కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో ఆమె మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తులు చేసుకోవచ్చని, త్వరలో స్పెషల్ ఇన్‌టెన్సివ్ సమ్మరీ రివిజన్ ప్రారంభమవుతుందని తెలియజేశారు. రూరల్ నియోజకవర్గంలోని పేదరిక నిర్మూలన పార్టీ గుర్తింపును కేంద్ర ఎన్నికల సంఘం శాశ్వతంగా రద్దు చేసిందన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్లు కల్యాణ్ చక్రవర్తి, సురేష్‌కుమార్, ఆర్ఐ భవాని, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రావూరి వెంకటేశ్వరరావు, వివిధ పార్టీల నాయకులు ఎస్.అప్పారావు, కేవీ రంగరామయ్య, గదుల సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానం

కాకినాడ రూరల్: దసరా ఉత్సవాలు ముగియడంతో కాకినాడ రూరల్ రమణయ్యపేట గ్రామ పరిధిలోని కనకదుర్గ అమ్మవార్ల ఆలయాల వద్ద బుధవారం భారీగా అన్నదానం నిర్వహించారు. గ్రామంలోని కూరగాయలు మార్కెట్ వద్ద వర్తకులు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. గ్రామస్తులు, స్థానికులు అన్న ప్రసాదం స్వీకరించారు.

ఓటరు జాబితా అవకతవకలపై సంతకాల సేకరణ



కాకినాడలో సంతకాల సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోట్‌క్లబ్: ఓటరుజాబితా అవకతవకలపై చేస్తున్న ఉద్యమంలో భాగంగా బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు కాకినాడలో కేంద్ర మాజీమంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు సంతకాల సేకరణ చేపట్టారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభిమానులు, నాయకులు కార్యకర్తలతో పెద్ద ఎత్తున పాదయాత్ర చేపట్టి ప్రజలకు అసలు ఓటర్లను ప్రభుత్వాలు ఏ విధంగా మోసం చేస్తున్నాయో వివరించారు. ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సేకరణలో భాగంగా నగరంలో ఉన్న ప్రముఖులు పళ్లంరాజును కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు చెక్క నూకరాజు, నాయకులు మట్ట ప్రసాద్, యాళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

బోట్‌క్లబ్: నగరంలో పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ఇన్‌చార్జి కమిషనర్ కేటీ సుధాకర్ తనిఖీ చేశారు. స్థానిక 11వ శానిటేషన్ సర్కిల్ పరిధిలోని వార్ఫురోడ్డు, జిల్లా పరిషత్ ప్రాంతాలను, 14వ సర్కిల్ పరిధిలోని గైగోలుపాడు ప్రాంతాల్లో పనులు పరిశీలించారు. శానిటేషన్ పనుల నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. శానిటేషన్ ప్రమాణాలు మెరుగుపడకుండా కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. 12వ సర్కిల్‌లోని మస్టర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు హాజరు పట్టిని పరిశీలించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సత్తిబాబు, దుర్గారావు పాల్గొన్నారు.

సమ్మెకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సిద్ధం కావాలి

బోట్‌క్లబ్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మెకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం కాకినాడ కమిటీ సమావేశం బుధవారం స్థానిక బాల భవన్ వద్ద నిర్వహించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను నవంబర్ 3వ తేదీ లోపు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్టు తెలిపారు. గురువారం గాంధీ విగ్రహాలకు సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందజేస్తామని, 22న కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన ధర్నా, 25న కార్పొరేషన్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ, 27న ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారంగా సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు అమలు చేయాలని, కాకినాడ స్పెషల్ శానిటేషన్ కార్మికులను, టాయిలెట్ కార్మికులను ఆప్కాస్‌లో విలీనం చేయాలన్నారు. బకాయి జీతాలు చెల్లించాలి, పర్మనెంట్ కార్మికులకు బకాయి డీఏ, సరెండర్ లీవ్‌లు తక్షణమే చెల్లించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, 11 పీఆర్సీ అమలు చేయాలని కోరుతూ చేస్తున్న సమ్మెకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, యూనియన్ నాయకులు బొబ్బిలి ఈశ్వరరావు, సింగంపల్లి రమణ, బంగారు రాజేష్, నిమ్మకాయల ఈశ్వరరావు పాల్గొన్నారు.